ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
15 సెప్టెంబర్
2025





# వ్యాపారంగా మారిపోయిన విద్యా.. వైద్యం

## వైద్యం వికటిస్తే ... వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు: సిపిఐ ఎంఎల్

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ప్రజా వైద్యమనేది సేవా దృక్పథం నుంచి కమర్షియల్,వ్యాపారంగా మారడంతో ఖరీదైన సరుకుగా అయినందున సామాన్యుల నుంచి మొదలుకొని మద్యతరగతి ప్రజలు ఆ ఖరీదైన వైద్యంను పొందలేక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని,ఒక సందర్భంలో కొందరు డాక్టర్ ల వైద్యం మూలంగా వయస్సుతో నిమిత్తం లేకుండా అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారని,అందులో భాగంగానే సెప్టెంబర్ 5 న ఆలేరు లో ప్రైవేట్ డాక్టర్ చేసిన ఇంజక్షన్ రీయాక్షన్ కావడంతో యాదగిరిగుట్ట మండలం కమటంగూడెంకు చెందిన ఏనుగుల ఉదయ్(40) ప్రమాణాలు కోల్పోవడం జరుగుతుందని,మృతిని కుటుంబానికి వృద్ధ తల్లి,భార్య,ఇద్దరు చిన్న ఆడపిల్లలు ఉన్నారని నేడు ఆ కుటుంబం కు ఎవరూ కూడా లేకుండా వంటరివారయ్యారని అఖిల భారత రైతు.కూలీ సంఘం (ఏ ఐ కే ఎం ఎస్)రాష్ట్ర గౌరవాధ్యక్షులు వక్కవంతుల కోటేశ్వరరావు,రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్ష పతి, సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్,యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఆర్.జనార్ధన్ లు ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 14 ఆదివారం రోజున యాదగిరిగుట్ట మండలం కమటంగూడెం లో సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సంతాప సభ జరిగింది. సంతాప సభ లో కామ్రేడ్ ఉదయ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కోటేశ్వరరావు, బిక్ష పతి,కుమార్,జనార్ధన్ లు మాట్లాడుతూ ప్రభుత్వాలకు ఒక్క వైద్య రంగం మీదనే కాదు, ఏ రంగం పై నియంత్రణ లేదని, ప్రతిదీ వ్యాపారంగా మార్చివేస్తున్నారని ఫలితంగా ప్రజలు అనేక సమస్యలను,ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, భవిష్యత్ ను కోల్పోతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పేరుకే తప్ప ఎక్కడా అమలు చేసిందిలేదని,పది లక్షల రూపాయల ఖరీదైన వైద్యం అనేది ప్రకటనలే తప్ప ఆచరణలో అమలు అవుతున్నది లేదని, ఆయుష్మాన్ భారత్ కార్డ్స్ పొందకుండా లాక్ చేసి ఉన్నదని విమర్శించారు. సమాజ మార్పు







కోసం,దోపిడీ,పీడనలు లేని నూతన సమాజ నిర్మాణానికి నడుంబిగించి పోరాడడం అంటే భవిష్యత్ ను అశ్వాదించడమేనని, ప్రజా విముక్తి దారులు వేయడమేనని స్పష్టం చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను ఓటు బ్యాంకుగా చూస్తున్నారని,సమాజం, ప్రజలు,అభివృద్ధి అనేది మరిచిపోయి,దేశాన్ని అమ్మివేయడానికి,ప్రజా సంపదనను బడా కార్పోరేట్,సామ్రాజ్యవాదుల కు అమ్మి వేయడానికి నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. నేపాల్ లో తాజా పరిణామాలను చూసినపుడు,అక్కడి ప్రభుత్వం పీకల్లోతు అవినీతి,పెరిగిన నిరుద్యోగం,మీడియా ప్లాట్ ఫామ్ లో నిషేదం,తదితర కారణాలతో జెన్ జీ (జనరేషన్ జడ్,1997 తర్వాత పుట్టిన వారు.)నిరసనలకు మూలమని అన్నారు. సంతాప సభ కు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బేజాడి కుమార్ అధ్యక్షత వహించారు.

సంతాప సభ లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లూరి రాజయ్య, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్, పీ ఓ డబ్ల్యూ జిల్లా అధ్యక్షులు ఆర్.సీత, ఏ ఐ కే ఎం ఎస్ జిల్లా అధ్యక్షులు కల్లేపు అడివయ్య,జనశక్తి నాయకులు ఇప్ప రామకృష్ణ, గ్రామ సర్పంచ్ ఉప్పు శ్రీరాములు, కాచారం మాజీ సర్పంచ్ కొండం అరుణ అశోక్ రెడ్డి,కామ్రేడ్ ఏనుగుల ఉదయ్ కుటుంబ అభిమానులు కాయితి నర్సింహారెడ్డి తదితరులు మాట్లాడారు.

సంతాప సభలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారులు శికిలం కుమారస్వామి, ఇక్కిరి శ్రీనివాస్,ఆర్.ఉదయ్, తమ్మడి రమేష్,లు పాడిన పాటలు సభికులను కంటతడి పెట్టించాయి.

ఇంకా ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా,డివిజన్ నాయకులు చిర బోయిన రాజయ్య, కట్టా సమరసింహారెడ్డి,చిరబోయిన కొమురయ్య, తమ్మడి అంజయ్య, సుంకే సుగుణమ్మ,పాకాల నరేష్, ఏనుగుల ఎల్లయ్య,పాకాల సరిత, గడ్డం మంకయ్య,గడ్డం యాదగిరి, తాడెం పాండు,వంగాల నర్సింహారెడ్డి,యెర్ర మల్లేష్, తలారి వెంకటేష్, ఉరడి రామచంద్రు,శికిలం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లా గోపా సమావేశం

## త్వరలో సంగారెడ్డి గోపా కార్యవర్గం ఏర్పాటు



సంగారెడ్డి, రోమింగ్ న్యూస్: సంగారెడ్డి పట్టణంలో అల్లా దుర్గం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ( గోపా ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏర్పాటు చేసిన సమావేశం ప్రభాకర్ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమశిక్షణ తో ఒకరికొకరు కలిసి ముందుకు వెళ్లితే సాధించలేనిది ఏదీ లేదని తెలియజేస్తూ, మొదటి సమావేశం తో పోల్చుకుంటే ఈ 2 వ సమావేశానికి నాలుగింతల సంఖ్య పెరిగింది కాబట్టి త్వరలో జిల్లా కమిటీ ఏర్పాటు కోసం ప్రతీ ఒక్కరూ కనీసం 10 మందితో సభ్యత్వం చేపించి అందరూ బాధ్యత వహించి ,త్వరలో కమిటీ ఏర్పాటు కు ప్రయత్నం చేద్దాం అని కోరడం జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గోపా ఆర్గనైజింగ్ సెక్రెటరీ యల్మకంటి మీరయ్య గౌడ్ హాజరై మాట్లాడుతూ గౌడ్ లు ఏకం కావడానికి ఏకైక వారది గోపా ఒక్కటే మార్గం అని ఈ మార్గంలో గౌడ్ లు ఏకమైనచో మన గౌడ జాతీ ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకూ పరిష్కారం లభిస్తుంది కాబట్టి గౌడ జాతి ఐక్యతను అభివృద్ధి దృష్టిలో పెట్టుకుని అర్హత ఉన్న ప్రతీ ఒక్కరూ గోపా లో సభ్యులుగా చేరి జాతి ఐక్యత, అభివృద్ధి కోసం వీలును బట్టి సహకరించుకోవడానికి క్రృషి చేయవలసిందిగా చూచించడం జరిగినది.

డాక్టర్ రాజు గౌడ్ మాట్లాడుతూ ప్రతి డిపార్ట్మెంట్ లోని వారు ప్రత్యేక శ్రద్ద తీసుకొని ఆయా డిపార్ట్మెంట్ లోని వారిని ఏకం చేస్తూ సమావేశాలకు వచ్చే విధంగా ప్రయత్నిస్తూ గోపా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పూసల లింగా గౌడ్ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా కమిటీ ఏర్పాటు చాలా ఆలస్యం అయ్యింది ఇప్పటికైనా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మనం అందరం తలా ఒక 5 మందిని వచ్చే సమావేశానికి వచ్చే విధంగా ప్రయత్నం చేస్తూ వచ్చే మీటింగ్ పెద్ద సంఖ్యలో నిర్వహిద్ధామని అందుకు తాను అన్ని విధాలుగా సహకరిస్తూ ప్రత్యేక సమయం ఇస్తానని, కేవలం నెల రోజుల వ్యవధిలోనే కమిటీ ఏర్పాటు చేయగలమని అందరిలో ఆసక్తి పెంపొందించారు. హరిశంకర్ గౌడ్ విశ్రాంత ఏర్ ఫోర్స్ ఉద్యోగి మాట్లాడుతూ గోపా అనేది ఒక నెట్వర్క్ కనెక్టర్ లాంటి వేదిక కాబట్టి ఇంత మంచి వేదికను ఉపయోగించుకొని గౌడు లు ఏకం కావాలి అని సూచించారు

విజయ్ గౌడ్ అడ్వోకేట్ మాట్లాడుతూ గోపా సేవలను గ్రామ గ్రామానికి తెలియజేస్తూ ప్రతీ ఒక్క గౌడ్ కి బరోసాను కల్పించినచో రాబోయే తరాలకు గోపా ఒక అద్వితీయమైన స్థానాన్ని మన జాతికి అందించగలదనే ఆశాభావం వ్యక్తం చేశారు. కొవ్వూరి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ఐఖ్యత లేక పోవుట వలన అన్ని పార్టీలు గౌడ జాతి ఓటు బ్యాంకు తో గెలిచి ఆ తర్వాత పట్టించుకోకుండా అన్యాయం చేస్తున్నారు కాబట్టి గోపా వంటి రాజకీయేతర బలమైన వ్యవస్థ ఉన్నప్పుడే మన జాతికి న్యాయం జరుగుతుందని అందుకోసమే మనం బలమైన వ్యవస్థ గా గోపా ను తయారు చేసుకోవాలి అని పిలుపునిచ్చారు.

# జనగామలో మంచినీటి గోస

**నెలకు వేల రూపాయలు చెల్లిస్తూ**
**నీటిని కొనుక్కొని తాగుతున్నారు**
**మంచినీళ్లను అందించకపోతే ఉద్యమిస్తాం**
**జనగామ జిల్లా బిజెపి నాయకుల హెచ్చరిక**



జనగామ, సెప్టెంబర్ 14: (రోమింగ్ న్యూస్) ఎన్నో దశాబ్దాలుగా ఇక్కడ నెలకొని ఉన్న ప్రధాన సమస్య మంచినీటి సమస్య. అధికారంలో ఎన్ని పార్టీలు వచ్చినప్పటికీ ఎంతమంది ఎమ్మెల్యేలు ఎంపీలు మారినప్పటికీ, ఎంతమంది కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు చైర్మన్లు అధికారులు మారినప్పటికీ, జనగామ జిల్లా అయినప్పటికీ ఇక్కడ నెలకొన్న మంచినీటి సమస్య మాత్రం ఎక్కడకు వచ్చిన ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. అడపా దడప నాయకులు అధికారులు మంచినీటి సమస్యను తొలగిస్తామని తాగడానికి శుభ్రమైన నీటిని అందిస్తామని వాగ్దానాలు చేస్తారే తప్ప అమలుకు మాత్రం నేర్చుకోవడం లేదు. జనగామ జిల్లా కేంద్రంలో తాగడానికి వీలులేని అపరిశుభ్రమైన మంచినీటిని సరఫరా చేయడం వల్ల ఎంతటి పేదవాడైనా మంచినీటిని కొనుక్కొని తాగాల్సిందే.

భారతీయ జనతా పార్టీ జనగామ జిల్లా అధ్యక్షులు సౌడ రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం జనగామ కు మంచినీటిని సప్లై చేసే చిటకోడూరు రిజర్వాయర్ ను, ఫిల్టర్ బెడ్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా రమేష్ తో పాటు ఇతర నాయకులు మీడియాతో మాట్లాడుతూ కోట్ల రూపాయల ప్రజాధనం వెచ్చించి జనగామ పట్టణ ప్రజల మంచినీటి కోసం నిర్మించినటువంటి రిజర్వాయర్లో పెద్దపెద్ద వృక్షాలు, మలినాలు, నాచు వంటి వాటిని తీసేసి శుభ్రపరచకుండా లోప భూయిష్టంగా నిర్మించినటువంటి నీటి శుద్ధి కేంద్రంలో సరైన సౌకర్యాలు లేవని, ఫిల్టర్ బెడ్లను ఆధునికరించాలని కనీసం అక్కడ సంబంధిత అధికారులు లేక రసాయనాలు ఏం మోతాదులో కలుపుతున్నారో కూడా తెలియని పరిస్థితి ఉంది అని ఆరోపించారు . ఇక్కడ మొత్తం అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తుందని అదేవిధంగా ప్రభుత్వం పట్టణంలో నివసిస్తున్న దాదాపు లక్ష యాభై వేల ప్రజలకు కనీసం ఒక గ్లాసు మంచినీటిని కూడా అందించలేని దుస్థితిలో ఉందని పట్టణంలో రెక్కాడితే కాని డొక్కాడని పేద ప్రజలు నెలకు సుమారు 2000 నుండి 3000 రూపాయలు కేవలం మంచినీటి మీదనే వెచ్చిస్తున్నారని పాల కంటే నీళ్లపై ఎక్కువ డబ్బులు ఖర్చు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడినుంచి సరఫరా అయ్యే నీరు తాగడం మాట అటుంచి కనీసం ఇంటి అవసరాల కోసం కూడా వాడుకోలేని దుస్థితి అని కాబట్టి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకొని పట్టణ ప్రజలందరికీ పరిశుభ్రమైన త్రాగు నీటిని అందించాలని లేనిపక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని తీవ్రంగా హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి జగదీష్ ,పట్టణ ఉపాధ్యక్షులు బింగి రమేష్ ,హరి ప్రసాద్ ,పట్టణ కార్యదర్శి శివకృష్ణ, జిల్లా కార్యదర్శి సతీష్, బీజేవైయం నాయకులు విజయ్ ,మహిపాల్ ,నవీన్, అభినయ్ ,రాఫ్తార్ ,చందు, శ్రీను తదితరులు పాల్గొన్నారు. అన్నమాట ప్రకారం బిజెపి గాని, ఇతర పార్టీలు గాని లేక అన్ని పార్టీలు కలిసి సంయుక్తంగా కానీ ఉద్యమాలు చేసి జనగామలో మంచినీటిని సరఫరా చేసే విధంగా కృషి చేయాలని ఇక్కడి ప్రజలు ముక్తకంఠతో కోరుకుంటున్నారు.

# బాకీ సొమ్ము చెల్లించాలని ఆటో యూనియన్‌కు దేవస్థానం నోటీసులు

**మూడు రోజుల్లో అమౌంట్**
**కట్టకపోతే ఆటోలను కొండపైకి**
**అనుమతించబోమని హెచ్చరిక**
**ఆలయానికి ఆటో యూనియన్**
**రూ.31.42 లక్షలు బాకీ**
**సోషల్ మీడియాలో చక్కర్లు**
**కొడుతున్న నోటీసుల పేపర్**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: పెండింగ్ అమౌంట్ చెల్లించాలని స్థానిక ఆటో యూనియన్ కు యాదగిరిగుట్ట దేవస్థానం అధికారులు నోటీసులు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఆలయ అభివృద్ధి పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొండపైకి ఆటోల రాకపోకలను నిలిపివేయగా.. కాంగ్రెస్ ప్రభుత్వం పలు కండీషన్లు పెట్టి కొండపైకి ఆటోలు నడుపుకునేలా అనుమతిచ్చింది. దేవస్థానంతో ఆటో యూనియన్ చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం.. ఆలయానికి ఆటో యూనియన్ నెలకు రూ.4,30,500 చెల్లించాలి. కానీ జనవరి నెలలో కేవలం రూ.3.02 లక్షలు చెల్లించిన ఆటో యూనియన్.. జనవరి నెల పెండింగ్ అమౌంట్ రూ.1,28,500 అమౌంట్ తో పాటు ఫిబ్రవరి నుండి ఆగస్ట్ నెల వరకు అమౌంట్ చెల్లించలేదు. ఎనిమిది నెలలకు గానూ ఆటో యూనియన్ మొత్తం రూ.31.42 లక్షలు దేవస్థానానికి బాకీ పడింది. దీంతో ఈ నెల 7న ఆటో యూనియన్ కు ఆలయ అధికారులు నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందిన మూడు రోజుల్లో బాకీ పడ్డ సొమ్ము చెల్లించకపోతే.. కొండపైకి ఆటోలను అనుమతించబోమని హెచ్చరించారు. ఆటో యూనియన్ కు జారీ చేసిన నోటీసులు ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. కాగా ఆటో యూనియన్ కు జారీ చేసిన నోటీసుల పత్రం బయటకు ఎలా వెళ్లిందని ఆలయ అధికారులు తెలుసుకునే పనిలో పడ్డారు. ఆలయ అధికారులు బయటపెట్టారా.? లేక ఆటో యూనియన్ సభ్యులు బయటకు లీక్ చేశారా.? అని ఆరా తీస్తున్నారు. ఆటో యూనియన్ కు ఇచ్చిన నోటీసులు సోషల్ మీడియాలో వైరల్ గా మారడం ఆలయ ఆఫీసర్లకు తలనొప్పిగా మారిందని కొందరు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

